క్లుప్తంగా

రక్తదానం



నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఎంసీ మెంబర్, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ సోమవారం 49వ సారి రక్తదానం చేశారు. మద్రాస్‌బస్టాండ్ పక్కనే ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రక్తనిల్వలు తక్కువగా ఉన్నందున తాను రక్తదానం చేశానని తెలిపారు. ఆరోగ్యవంతులు ఏటా నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని చెప్పారు. అందులో భాగంగా తాను ప్రతి మూడు నెలలకొకసారి చొప్పున ఇప్పటి వరకు 49 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, రెడ్‌క్రాస్ కార్యదర్శి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



నెల్లూరు(బృందావనం): జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సింగంశెట్టి రవిచంద్ర ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి పంచారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అనుదీప్, కిరణ్‌తేజ, వెంకీ, బబ్లూ, ధీరజ్, నిఖిల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి నివాళి



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గొడహాస్టల్ సెంటర్‌లో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నీతి, నిజాయితీ మూర్తీ భవించిన మహోన్నత వ్యక్తి ఆంధ్రకేసరి అని కొనియాడారు. బ్రాహ్మణ సంఘ నాయకులు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, శ్రీధర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా శాఖ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ తమ సంఘ సభ్యురాలు అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి తన తండ్రి బొగ్గవరపు లక్ష్మీనారాయణ స్మృత్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు హాస్యాస్పదం



నెల్లూరు(మినీబైపాస్): కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన నాలుగు విడతల ఎన్నికల్లో ఇండియా కూటమికి 273 లోక్‌సభ సీట్లు వస్తాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఎద్దేవా చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న దేశప్రజలు కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడనున్నారన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి కే ప్రసన్న, బీజేపీ నాయకులు సాయికుమార్, శ్రీనివాసులు రెడ్డి, యువకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధుర ఫలం.. మామిడి

- వేసవిలో బంగినపల్లికి మంచి గిరాకీ
- ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్న ఫల ప్రియులు
- ఇళ్ల ముంగిటకే విక్రయాలు
- జిల్లా వ్యాప్తంగా రోజుకు వంద టన్నులకు పైగా వ్యాపారం



కస్తూరిదేవీ స్కూల్ ఎదురుగా రోడ్డు పక్కన మామిడి పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు

నెల్లూరు(బారకాసు): మధుర ఫలం మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. పండ్లల్లో రారాజు మామిడి. ఈ ఫలం పేరు చెబితే నోరూరుతుంది. మామిడిలో బంగినపల్లి రకానికి ప్రత్యేక స్థానం ఉంది. రోడ్డుపై వెళుతున్నప్పుడు బంగినపల్లి కనిపిస్తే ఫలప్రియులు చూపు తిప్పుకోలేరు. అత్యంత మధురమైనది.. నోరూరిస్తుంది.. చూడడమే ఆలస్యం..వెంటనే తినేయాలనిపిస్తుంది. వేసవి కాలం వస్తే చాలు..వీటిని రుచి చూడకుండా ఉండలేరు. ఈ పండ్లకు ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. మామిడి పండ్లలో ఎన్నో రకాలుండగా ఫలప్రియులు అత్యధికంగా ఇష్టపడే రకం అది. ఈ సీజన్‌లో బంగినపల్లి తినని వారుండరు అని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఎవరైనా తమ బంధువుల ఇళ్లకు వెళితే వారి వెంట ఈ పండ్లను తీసుకెళ్తుంటారు. స్నేహితులకు అందజేస్తుంటారు.

➡ ప్రపంచంలో మామిడి సాగులో భారతదేశానిదే అగ్రస్థానం. రాష్ట్రంలోనూ పలు జిల్లాలో మామిడి పండ్ల తోట పెంపకం అధికం. మన జిల్లాలో ఉలవపాడు, రాపూరు, గూడూరు, ఆత్మకూరు, సంగం, కావలి, ముత్తుకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో మామిడిపండ్ల తోటలు ఉన్నాయి.

➡ కృష్ణాజిల్లాలోని నూజివీడుతో పాటు జిల్లాలోని ఉలవపాడు ప్రాంతంలో పండిన మామిడి పండ్లను జిల్లా వాసులు బాగా ఇష్టపడతారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు మామిడి విక్రయాలు జరుగుతుంటాయి. మే రెండో వారం నుంచి కోతలు మొదలు పెడతారు.

➡ మనరాష్ట్రంలో అతిముఖ్యమైన రకం బంగినపల్లి. కిలోకు సైజును బట్టి రెండు నుంచి నాలుగు వరకు తూగుతాయి.

➡ నెల్లూరు మార్కెట్‌కు రాపూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల నుంచే కాకుండా కృష్ణా, ప్రకాశం, చిత్తూరు జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాల నుంచి పండ్లను దిగుమతి చేసుకుంటారు.

➡ జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రిటైల్‌గా విక్రయించేవారు నెల్లూరులోని పండ్ల మార్కెట్‌కు వచ్చి హోల్‌సేల్‌గా తీసుకుని వెళ్లి విక్రయిస్తుంటారు. అయితే ఇటీవల కాలంలో పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ మామిడి హోల్‌సేల్ దుకాణాలు ఏర్పడ్డాయి. అక్కడి సమీప ప్రాంతాలకు చెందిన వారు ఆయా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసి రిటైల్ విక్రయాలు చేసుకుంటున్నారు.

➡ నెల్లూరులోని చిన్నబజార్‌లో ఉన్న పండ్ల మార్కెట్ నుంచి ప్రస్తుతం రిటైల్‌గా అమ్ముకునేవారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. రోజుకు 30 నుంచి 35 టన్నుల మేర విక్రయాలు జరుగుతున్నాయని, మరి కొద్దిరోజుల తరువాత 50 టన్నుల వరకు విక్రయాలు జరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

➡ జిల్లా వ్యాప్తంగా బంగినపల్లి విక్రయాలు రోజుకు వంద టన్నులకు పైగా జరుగుతుంటాయని అంచనా. కాగా సీజన్ ముగిసేందుకు ఇంకా రెండు నెలల సమయం ఉండనుండడంతో వ్యాపారం బాగా జరిగే అవకాశం ఉందని పండ్ల వ్యాపారస్తులు భావిస్తున్నారు.

నగరంలో ఇలా..

నగరంలో బంగినపల్లి పండ్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. మినీబైపాస్, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరుబస్టాండ్, నవాబుపేట, పొదలకూరురోడ్డు, బాలాజీనగర్, చిన్నబజార్, తదితర ప్రాంతాల్లో తోపుడు బండ్లు, బుట్టలు, ప్లాస్టిక్ ట్రేలపై పెట్టుకుని విక్రయిస్తున్నారు. అంతేకాకుండా ఆటోల్లో ఇళ్ల ముంగింటకే తీసుకెళ్లి అమ్ముతున్నారు. అదేవిధంగా సూపర్ మార్కెట్లలో కూడా బంగినపల్లిని అందుబాటులో ఉంచుతున్నారు. పండు నాణ్యతను బట్టి కిలో రూ.80 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఎంతో ఇష్టపడుతున్నారు. మూడు నెలల పాటు కొనసాగే మామిడి పండ్ల వ్యాపారంతో అనేక మంది జీవనం పొందుతున్నారు.

మామిడిలో పోషక విలువలు

మామిడి పండ్లలో అనేక పోషక విలువలున్నాయి. ఇందులో కార్బన్ కణాలను అరికట్టే గొప్పగుణం ఉంది. ఈ పండులో ఉండే ఫాలీఫినోల్ ఇందుకు సహకరిస్తుంది. 15 శాతం చక్కెర, ఒకశాతం మాంసకృత్తులు, ఏ, బీ, సీ విటమిన్లు ఉంటాయి. పిండి పదార్థాలు 17 గ్రాములు, మాంసకృత్తులు 51 గ్రాములు, థయామిన్ 0.58 గ్రాములు, నియాసిన్ 0.584 గ్రాములు ఉంటాయి.



బీవీఎస్ స్కూల్ వద్ద ఆటోలో మామిడి పండ్లు అమ్ముతున్న దృశ్యం

ఆరోగ్యానికి మంచిది



కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. వేసవిలో వచ్చే మామిడి పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. సహజంగా పండిన కాయలను తింటేనే మంచిది. కొందరు వ్యాపారులు పచ్చి కాయలను తీసుకొచ్చి క్యాల్షియం కార్బైడ్ రసాయాన్ని వినియోగిస్తారు. అలా మాగించిన పండ్లు ఆరోగ్యానికి హానికరం.

– ఎంవీ రమణయ్య, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వైద్యుడు

దిగుబడులు తగ్గడంతో డిమాండ్



ఏటా వేసవిలో నెల్లూరు మార్కెట్‌కు కృష్ణ, ప్రకాశం, చిత్తూరుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. ప్రధానంగా బంగినపల్లి మామిడికి మంచి గిరాకీ ఉంటుంది. నిత్యం వంద టన్నులకుపైగా విక్రయాలు జరుగుతుంటాయి. గత రెండేళ్లుగా జిల్లాలో ఎక్కడికక్కడ పండ్ల గోదాములు ఏర్పాటవడంతో నెల్లూరులోని పండ్ల మార్కెట్ నుంచి కేవలం నగరంతో పాటు సమీప పల్లెలకు చెందిన వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రోజుకు 30 నుంచి 35 టన్నుల పండ్లు మాత్రమే విక్రయించగలుగుతున్నాం. ఈ ఏడాది దిగుబడి తక్కువ కావడంతో మామిడి పండ్లకు డిమాండ్ ఏర్పడి ధరలు పెరిగాయి.

–జిలానిబాషా, అధ్యక్షుడు, నగర పండ్ల వ్యాపారుల సంక్షేమ సంఘం

రోజుకు రూ.700 వరకు ఆదాయం



కొన్నేళ్లు బండిపై పండ్లు విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. సీజనల్‌గా వచ్చే పండ్లు అమ్ముతుంటాను. ప్రస్తుతం వేసవిలో బంగినపల్లి మామిడిపండ్లు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అందుకే వాటినే తీసుకొచ్చి అమ్ముతున్నాను. రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు ఆదాయం వస్తోంది.

– ఎస్‌కే.సందాని, పండ్లవ్యాపారి

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి



నెల్లూరు(క్రైమ్): పోలీసు సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ కే ఆరిఫ్ హఫీజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని ఏపీ పోలీసు అధికారుల సంఘ రాష్ట్ర నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి సిబ్బంది సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్న ఎస్పీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో సంఘ రాష్ట్రాధ్యక్షుడు జనకుల శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి, ఉపాధ్యక్షుడు పీ శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే గౌస్‌బాషా, కోఆప్షన్ మెంబర్ బీవీ నరసయ్య, జిల్లా పోలీసు కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి వైవీ రమణయ్య, డైరెక్టర్ బీ రమణయ్య, సభ్యులు ఉదయ్, తదితరులు ఉన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం



నెల్లూరు(మినీబైపాస్): రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై అవగాహన కల్పించారు. వేసవి సెలవులను పురస్కరించుకుని జూన్ 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీ పాజిటివ్ సుబ్బారావు, ప్రజాసైన్స్ వేదిక పట్టణాధ్యక్షుడు సతీష్ కుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, కృష్ణయ్య, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల సంస్మరణోత్సవాలు



ఉపన్యాసకులు శ్రీరామలాలశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఒరుగంటి శ్రీరామలాలశర్మ 'భాష్యసూత్ర ప్రవచన సప్తాహం'లో భాగంగా మూడోరోజు సోమవారం 'చతుస్సూత్రి' ప్రవచనం చేశారు. అథతో బ్రహ్మ జిజ్ఞాస అనే మహావాక్యాన్ని ఆదిశంకరుల వారు తమ శారీరక మీమాంస గ్రంథంలో ఎలా వివరించారో లక్ష్యార్థ వాక్యపూర్వకంగా విశ్లేషించారు. అద్వైత సిద్ధాంత సారాన్ని, వేదబోధ చేశారు. అనంతరం శ్రీరామలాలశర్మను సభాపోషకులు తాడికొండ శ్రీరామకృష్ణశర్మ, డాక్టర్ పీ చంద్రశేఖర్, చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీకి చెందిన చక్రాల ఆనంద్‌కుమార్, ములుముడి ఉదయ్‌కుమార్‌శర్మ, ఎం లక్ష్మీనరసింహారావు, జీ ప్రభాకర్‌శర్మ, పీ ఛాయాకుమారి ఘనంగా సత్కరించారు. తొలుత స్వయంపాకుల సుబ్రహ్మణ్యంశర్మచే విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ట్రస్ట్ మేనేజర్ సీవీఎల్ నరసింహం పర్యవేక్షించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నెల్లూరు(క్రైమ్): నగర పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నెల్లూరు నగర సబ్‌డివిజన్ పరిధిలో ఏపీ పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీల నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉందని తెలిపారు. కోడ్ ముగిసిన తరువాత పరిశీలించి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతిస్తామన్నారు. పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలు చేయరాదని పెట్రోల్‌బంకుల నిర్వాహకులకు సూచించారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, ఎన్నికల కేసుల్లో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

- నెల్లూరు రూరల్ సబ్‌డివిజన్ పరిధిలోని వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు రూరల్, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కృష్ణపట్నం పోర్టు పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉందని నెల్లూరు రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తప్పవని సోమవారం ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు.

ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నాలు

నెల్లూరు(బృందావనం): మద్రస-ఏ-నూరుల్ ఇస్లాం ట్రస్ట్ తరుపున ఇస్మాయిల్‌ఖాదిరి ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నాలు కార్యక్రమాన్ని 29వ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంద మంది చిన్నారులు ఉచితంగా ఖత్నాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరై నెల్లూరు నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ చేతుల మీదుగా ఉచితంగా దుస్తులు, మందులు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్, 42వ డివిజన్ కార్పొరేటర్ షేక్ కరీముల్లా, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, 29వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సాయిరెడ్డి, 34వ డివిజన్ అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ సూరిబాబు, బీసీ నాయకులు అమర్, ప్రైవేట్ విద్యా సంస్థల చైర్మన్ షేక్ అన్వర్‌బాషా, షేక్ అమీర్‌జాన్, బారాషహీద్ దర్గా కమిటీ మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్‌రజాక్, తదితరులు పాల్గొన్నారు.



నయనానందకరం..చంద్రప్రభ వాహనసేవ



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి అన్నపూర్ణ, విశాలాక్షి, కాశీవిశ్వనాథస్వామి ఉత్సవమూర్తులు విశేషాలంకారంలో చంద్రప్రభ వాహనంపై కొలువై భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఇడమకంటి కృష్ణారెడ్డి, రామలక్ష్మమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓలు దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.30గంటలకు స్వామి వారు రావణసేవ అలంకారోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఈఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శతచండీయాగం



శతచండీయాగం నిర్వహిస్తున్న రుత్విక్కులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న శత చండీయాగాన్ని రెండోరోజు సోమవారం భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేదపండితులు, రుత్విక్కులు ఉదయం చండీహోమం నిర్వహించారు. ప్రదోషం సందర్భంగా సాయంత్రం నందీశ్వరునికి, శివునికి ఏకకాలంలో పంచామృతాభిషేకం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. మందిరంలో కొలువైన సిద్ధివిఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, జ్ఞాన సరస్వతి, ఆదిత్యాది నవగ్రహ, షిర్డీసాయినాథ, దక్షిణామూర్తి, కమలాంబిక సమేత త్యాగరాజేశ్వర, సీతారామలక్ష్మణ హనుమత్సమేత సద్గురు త్యాగరాజస్వామికి విశేషాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ సభ్యులు ఎనమండ్ర నాగదేవిప్రసాద్ మాట్లాడుతూ శతచండీయాగం మంగళవారం మహా పూర్ణాహుతితో పరిసమాప్తమవుతుందని తెలిపారు. ఉదయం 7గంటల నుంచి రుద్ర,పురుష, శ్రీమన్యసూక్తం హోమం, తదుపరి చండీ హోమం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, బాలపూజ, సువాసినిపూజ నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలను మందిర ధర్మకర్త ఎనమండ్ర చైతన్యకుమార్, వైష్ణవి దంపతులు, త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ సభ్యులు, బిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుడికి ఆపన్నహస్తం



అలెగ్జాండర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు అలెగ్జాండర్‌కు సహచర ఉపాధ్యాయులు ఆపన్నహస్తం అందించారు. వివరాలు.. అలెగ్జాండర్ గూడూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 2న జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనుకగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో అలెగ్జాండర్ తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స నిమిత్తం తమిళనాడు రాష్ట్రంలోని రాయవేలూరు ఆస్పత్రిలో చేర్పించారు. అలెగ్జాండర్ కుటుంబ ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉండడంతో ఏపీ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా శాఖ సహకారంతో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు తమ వంతుగా రూ.36వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును అసోసియేషన్ నెల్లూరు నగర అధ్యక్షుడు కోదండరామిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెం బర్ సాయిబాబా సోమవారం రాయవేలూరు వెళ్లి అలెగ్జాండర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. అలెగ్జాండర్‌కు ఆర్థిక సాయం చేయాలనుకునేవారు 99594 39574 నంబర్‌కు ఫోన్‌పే, గూగూల్‌పే ద్వారా నగదు పంపాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.



కైలాససేవ అలంకారం

నేత్రపర్వం.. కైలాససేవ



విశేషాలంకారంలో ఆదిదంపతులు

వైశాఖ మాసం సందర్భంగా మూలాపేటలో కొలువైన భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వసంతోత్సవాలు సోమవారంతో పరిసమాప్తమయ్యాయి. చివరి రోజు కైలాససేవ అలంకారోత్సవంలో మూలస్థానేశ్వరుడు భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా మోదెం సత్యనారాయణగుప్తా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

–నెల్లూరు(బృందావనం)